క్లుప్తంగా

ధారూరు అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాన్‌సింగ్

ధారూరు: ధారూరు అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు మాన్‌సింగ్ పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో మండలానికి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి, సంక్షేమ పనులు నిర్వహిస్తామన్నారు. మండల పరిధిలోని దోర్నాల్ గ్రామంలో కొత్తగా మంజూరైన సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోర్నాల్ గ్రామానికి జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20లక్షలు మంజూరయ్యాయని దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతీగ్రామం, తండాలు అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

పంచాయతీ కార్యదర్శి కవిత



అవగాహన కల్పిస్తున్న కవిత, సాయిభరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్

కుల్కచర్ల: ప్లాస్టిక్ వినియోగాన్ని విడిచి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి కవిత తెలిపారు. శనివారం కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్‌లో జీవమిత్ర ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను వినియోగించొద్దన్నారు. ప్లాస్టిక్ స్థానంలో గన్నీ, పేపర్ సంచులు ఉపయోగించుకోవాలన్నారు. వాటర్‌బాటిల్ స్థానంలో గాజు, స్టీల్ సీసాలు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవమిత్ర ఆర్గనైజేషన్ నిర్వాహకులు సాయిభరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బట్టీల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవు

సీఐ శ్రీనివాస్‌రెడ్డి



ఇటుక బట్టీల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: పిల్లలను ఇటుక బట్టీల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో పలు ఇటుక బట్టీలను ఎస్ఐ అన్వేష్ రెడ్డితో పాటు ప్రొహిబిషన్ ఎస్ఐలతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇటుకబట్టీల నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా చిన్నారులను పనుల్లో పెట్టుకోవద్దన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప



పరిసరాలను పరిశీలిస్తున్న జడ్జి నాగుల శిల్ప

పరిగి: బాలసదనంలోని చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని బాలసదనాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, పరిసరాలను, గదులను పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎల్లప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బాలసదనంలో ఉన్నారంటే వారు ఎలాంటి బంధాలు లేని వారని, వారికి మనమే అన్ని చేకూర్చాలన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లప్పుడు పర్యవేక్షిస్తూ సంరక్షించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ న్యాయవాదులు గౌస్‌పాషా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం' పై ఫోకస్

- గ్రామాల్లో జోరుగా సాగుతున్న ఎన్నికల చర్చ
- బరిలో దిగేందుకు యువత ఆసక్తి
- రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ
- 33 జీపీలు, 308 వార్డులు
- మండలంలో 43,868 ఓటర్లు



చంద్రకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చలు మొదలయ్యాయి. కులగణన ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారనే సమాచారంతో ఇన్నాళ్లు సస్తబ్దంగా ఉన్న నాయకులు, ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. స్థానిక సమరంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రాజకీయ వారసులతో పాటు, గతంలో ఎన్నడూ ప్రత్యక్ష రాజకీయాల్లో లేనివారు సైతం రాజకీయ ఆరంగ్రేటం చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల పంచాయతీ ఎన్నికలపై అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయడం, గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియలు వేగవంతం చేయడంతో పోటీదారుల్లో ఆసక్తి పెరిగింది. ఇక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపగానే బరిలోకి దిగేందుకు అవసరమైన అంగబలం, అర్థబలం సమకూర్చుకుంటున్నట్లు సమాచారం. మండలంలో 33 జీపీలు, 308 వార్డుల్లో మొత్తం 43,868 ఓటర్లు ఉన్నారు. వారు తమ ఓటును త్వరలో నిర్వహించనున్న ఎన్నికల్లో వినియోగించుకోనున్నారు.

రిజర్వేషన్ల సమీకరణలు

స్థానిక సమరంలో పార్టీ బలం కంటే వ్యక్తిగత ఇమేజ్ ఎక్కువగా పనిచేస్తుంది. దీంతో పలువురు ఆశావహులు నిత్యం ప్రజల్లో తిరుగుతూ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రిజర్వేషన్లపై అంచనాలు వేసుకుంటూ తమ ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

రిజర్వేషన్లపై చర్చ

స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా? లేదా కొత్త రిజర్వేషన్లు అమలు చేస్తారా? అనేది తేలాల్సి ఉంది. కులగణన తర్వాత రిజర్వేషన్లలో మార్పులుంటాయని ఫలానా రిజర్వేషన్ వస్తే నేను, ఇంకొటైతే అతను బరిలో ఉంటారని ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకునేందుకు ఇప్పటినుంచే ఒప్పందాలు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ సారి ఎన్నికల బరిలో దిగేందుకు యువత ముందుకొస్తుండడంతో గట్టి పోటీ తప్పదనే ప్రచారం సాగుతుంది. పార్టీలకతీతంగా నిర్వహించనున్న ఎన్నికలైనప్పటికీ పరోక్ష పద్ధతి ప్రభావం ఉంటుంది. కాబట్టి మండలంలో గత వైభవాన్ని నిలుపుకునేందుకు బీఆర్ఎస్, ముఖ్యమంత్రి నియోజకవర్గం కాబట్టి అన్ని స్థానాల్లో తమ సత్తా చాటాలనే లక్ష్యంతో అధికార కాంగ్రెస్, స్థానిక సంస్థల్లో కొన్ని స్థానాల్లోనైనా పట్టుసాధించేందుకు పావులు కదుపుతున్నాయి.

క్రీడలతో భవిష్యత్

- ఆర్బీఓఎల్ ఫ్యాక్టరీ ఎండీ సరళాశ్రీనివాస్
- విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తాండూరు టౌన్: క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఆర్బీఓఎల్ ఫ్యాక్టరీ ఎండీ సరళాశ్రీనివాస్ పేర్కొన్నారు. హిందూ ధార్మిక పరిషత్, తాండూరు ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం నిర్వహించారు. అండర్ -14, 16 విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించారు. ఫైనల్‌కు మొత్తం 104 మంది ఎంపికవ్వగా అందులో అండర్-14 విభాగంలో విన్నర్‌గా షేక్ ఇబ్రహీం, రన్నర్‌గా భవానీ శంకర్ నిలిచారు. అండర్-16విభాగంలో విన్నర్‌గా ముతసిం, రన్నర్‌గా సాయిచరణ్ బాబు నిలిచారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సరళాశ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌లో గేమ్స్‌లకు అలవాటు పడి, మైదాన క్రీడలకు ఆసక్తి చూపడం లేదన్నారు. మేధోసంపత్తిని పెంపొందించే ఆటల్లో చెస్ ప్రథమ స్థానంలో ఉంటుందని, విద్యార్థులకు ఇలాంటి పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య గౌడ్, హిందూ ధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్, తాండూరు ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన జగత్తుకు కృషిచేయాలి

కడ్తాల్: ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ వేసిన ధ్యానమనే పునాదులపై సకలజనులు నడుచుకోవాలని పరిణిత పత్రి సూచించారు. మహేశ్వర మహాపిరమిడ్ పత్రీజీ ధ్యాన మహాయాగం శనివారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రాపంచిక ఎదుగుదలతో పాటు, ఆధ్యాత్మిక ఎదుగుదల ఉండాలని చెప్పారు. ధ్యాన జగత్తుకు కృషి చేయాలని కోరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి.. మహాయాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శంకర్

ఐకమత్యంతో మెలగాలి

బషీరాబాద్ ఎస్ఐ శంకర్

బషీరాబాద్: ప్రజలు ఐకమత్యంతో మెలగాలని బషీరాబాద్ ఎస్ఐ శంకర్ సూచించారు. శనివారం మండలంలోని అల్లాపూర్, దామర్‌చెడ్, వాల్యానాయక్, జమ్లానాయక్ తండాల్లో పర్యటించి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నచిన్న సమస్యలకు ఇంటి పక్క వాళ్లతో గొడవలు పెట్టుకోవద్దని, గట్టు సమస్యలు ఉన్నా పెద్దల సమక్షంలో కూర్చొని పరిష్కరించుకోవాలన్నారు. క్షణికావేశంలో గొడవలు పడి పోలీస్ కేసులతో జైలు పాలుకావొద్దని హితవు పలికారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరికే మొగ్గు

- కూరగాయలు, ఇతర పంటలపై కొరవడిన ఆసక్తి
- రబీలో కూడా వరినే..
- పంట మార్పిడికి శ్రద్ధ తీసుకోని రైతులు



నాట్లకు సిద్ధమైన నారుమడి

దౌల్తాబాద్: రైతన్నలు ఎక్కువగా వరిపంట వైపే మొగ్గు చూపుతున్నారు. మిగతా పంటల సాగుపైనా దృష్టి సారించడంలేదు. అన్ని రకాల పంటలసాగు గురించి తెలిసినా కూడా రబీలో వరినే ఎంపిక చేసుకుంటున్నారు. తరచూ వరిసాగు చేయడంతో భూసారం తగ్గి దిగుబడులు కూడా తక్కువవుతాయి. మండలంలో గత యాసంగిలో సుమారు 5వేల ఎకరాల్లో సాగు చేస్తే ప్రస్తుత సీజన్‌లో మరో వెయ్యి ఎకరాల్లో సాగు పెరిగినట్లు వ్యవసాయాధికారుల అంచనా. కొన్నేళ్లుగా ఇక్కడి రైతులు వరిసాగునే ఎంచుకొని అధిక దిగుబడులు సాధించారు. అందుకే వారు మళ్లీ వరినే ఎక్కువగా నమ్ముకుంటున్నారు. మండలంలో చెరకు, చిరుధాన్యాలు, కూరగాయలకు కూడా సారవంతమైన నేలలు ఉన్నా వీటిని తక్కువగా సాగు చేస్తున్నారు. చెరుకు పంట సాగుకు సంవత్సర కాలం, సరైన రవాణా వ్యవస్థ, అందుబాటులో చక్కెర పరిశ్రమలు లేకపోవడంతో చెరకు సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం రైతులు వేసిన తుకాలు ఎదగకపోతే సంక్రాంతి తర్వాత పెసర, మినుములు సాగు చేసే అవకాశం ఎక్కువగా ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయధికారులు రైతుల పొలాలకు వెళ్లి వారి భూములను పరీక్ష చేయించి వాటి ఫలితాలను కూడా రైతులకు అందజేసేవారు. దీంతో తమ నేల సారాన్ని బట్టి పంటలు వేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఐనప్పటికీ కూడా రైతులు వరిపైనే దృష్టి సారించారు.

అవగాహన కల్పించాం

మండలంలోని రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాం. నీటి వసతి లేని రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి. భూసారం, నేలలో ఉన్న పోషకాలను బట్టి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించాం.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

మాజీ సర్పంచ్ రాములు



మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమ: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయమని మాజీ సర్పంచ్ గందె రాములు అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి కాంగ్రెస్ నేతలతో కలసి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ మృతి దేశానికి తీరని లోటన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో దేశ ప్రజలకు ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, రాములు, రమేశ్, ఇంతియాజ్, హైమద్, ముబెర్, మహేశ్, కృష్ణ, హరిలాల్, తాండూర్ అంతమ్మ, తదితరులు

పెచ్చులూడిన పాఠశాల తరగతి గది



తరగతి గదిలో ఊడిన స్లాబ్ పెచ్చులు



ఆరుబయట పాఠం చెబుతున్న ఉపాధ్యాయురాలు

- భయంతో పరుగులు తీసిన విద్యార్థులు, ఉపాధ్యాయురాలు
- తప్పిన ప్రమాదం

దుద్యాల్: తరగతిగదిలో పాఠం బోధిస్తుండగా భవనం పైకప్పు పెచ్చులూడి కిందపడడంతో భయంతో పరుగులు తీశారు. ఈ సంఘటన మండల పరిధిలోని హస్నాబాద్ హరిజన్ చెర్రీ పాఠశాలలో చోటు చేసుకుంది. విద్యార్థులు, పాఠశాల హెచ్ఎం కీర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజుమాదిరిగానే శనివారం కూడా తరగతులు జరుగుతున్నాయి. ఉదయం 11 గంటల తరువాత తరగతి గది పైకప్పు నుంచి పెచ్చులూడి పడడంతో అప్రమత్తమైన విద్యార్థులు వెంటనే తరగతిగది నుంచి భయంతో బయటకు పరుగులు పెట్టారు. ఉపాధ్యాయురాలు వారితో పాటు పరుగులు తీసింది. కొద్ది సేపటికే మరోచోట కూడా పైకప్పు కూలింది. దీంతో విద్యార్థులు మరింత భయాందోళనకు గురయ్యారు. అనంతరం ఉపాధ్యాయురాలు ఆరుబయటే పాఠాలు బోధించింది. ఏదైన జరగరాని సంఘటన సంభవించి ఉంటే బాధ్యులు ఎవరని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

అనంతగిరి: పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. ప్రతి నెల రూ.26వేల వేతనం చెల్లించాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రూ. 10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. విద్యార్హతను బట్టి ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, అర్జున్, వెంకటయ్య, పద్మమ్మ, ఆశప్ప, రాజు, భాగ్యమ్మ, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మాంసం వ్యర్థాల సేకరణకు వేలం



మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, కమిషనర్ విక్రంసింహారెడ్డి

రూ.12.55లక్షలకు కైవసం

తాండూరు: మాంసపు వ్యర్థాల సేకరణ కోసం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో దక్కించుకున్నారు. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణకు చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, కమిషనర్ విక్రంసింహారెడ్డి సమక్షంలో వేలం నిర్వహించారు. మొదట నలుగురు రూ.లక్ష డిపాజిట్ చేసి వేలం ప్రారంభించారు. రూ. 6లక్షల నుంచి మొదలైన వేలంలో బిర్కట్‌రఘు, ఏజాజ్, అఫ్జల్, హైమద్‌లు పోటీలో ఉన్నారు. చివరకు అందరి కంటే ఎక్కువగా అఫ్జల్ రూ.12.55లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ మాట్లాడారు. తాండూరు మున్సిపల్ ఏర్పడిన నాటి నుంచి ఎప్పుడు లేని విధంగా మాంసపు వ్యర్థాల సేకరణకు మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరిందన్నారు. ప్రస్తుతం నిర్వహించిన వేలం మున్సిపల్ నిబంధనలననుసరించే జరిగిందన్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారమే మాంసపు వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం నిర్వహించామని కమిషనర్ విక్రంసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, సంగీతాఠాకూర్, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ బంటారం బాలికల పాఠశాలలో వచ్చే సంవత్సరం 2025–26గాను ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సునీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, డిసెంబర్ 21 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. చివరి గడువు ఫిబ్రవరి 1వ తేదీలోపు అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 23వ తేదీన 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆంజనేయస్వామికి చందనం సమర్పణ

ధారూరు: ధనుర్మాసంతో పాటు శని త్రయోదశి సందర్భంగా శనివారం ధారూరు మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో భక్తులు శివపూజలు నిర్వహించారు. జలం, పాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. పూజారి చెన్నబసవయ్యస్వామి శివలింగాన్ని అలంకరించి హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

◆ ఘనంగా శని త్రయోదశి పూజలు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతలలో వెలసిన శనైశ్చరస్వామికి శనివారం త్రయోదశి సందర్భంగా భక్తులు తైలాభిషేకంతో స్వామిని తరింపచేశారు. ఉదయం నుంచే భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకొన్నారు. నల్లని దుస్తులు, నువ్వుల నూనేతో అభిషేకం చేశారు. సప్తవృక్షాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

◆ ఉద్యోగాలకు దరాఖాస్తుల ఆహ్వానం


అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లి సమీపంలో కొనసాగుతున్న మోమిన్‌పేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల, కళాశాలలో జీవశాస్త్రం, ఫిజియోథెరపి, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపల్ ఉషా కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సంబంధిత పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు


పరిగి: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని 4వ వార్డు టీచర్స్ కాలనీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తారన్నారు. కాంగ్రెస్ అంటేనే పేద ప్రభుత్వమని పేదల కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, హరిశ్చందర్, బాల్‌రాజ్, రజిత పావని తదితరులు పాల్గొన్నారు.

దోమలో...

దోమ: గ్రామాల్లో ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సహకరించాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. శనివారం దోమ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 రోజుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారని, ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సర్వే ఈ నెల 31 వరకు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పరిగి: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కమిటీ సభ్యులు తదితరులు



దోమ: ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

క్రీడలతో శారీరక దృఢత్వం

యువత క్రీడలు ఆడడం వల్ల వారిలో శారీక దృఢత్వం పెరుగుతుందని ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నెహ్రూ యువ కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లాక్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల నుంచి 15 ఏళ్ల నుంచి 25 వయస్సు గల విద్యార్థులు హాజరు కాగా వారికి వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వంద మీటర్ల పరుగు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు మెమోంటోలను అందజేశారు. అప్పుడే మంచి స్థానాలను అధిరోహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు రాముడు, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, నజీర్, బుజ్జిబాబు, జూనియర్ కళాశాల అధ్యాపకులు సురేశ్, ఫిజికల్ డైరెక్టర్లు సత్తయ్య, కృష్ణమూర్తి, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.